క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పేదలకు దుప్పట్లను ఏసీ స్టేడియం మహిళా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షురాలు వసుంధర తన సొంత నిధులతో వీటిని అందజేశారు. వైస్ ప్రెసిడెంట్ బాసం ఆదిలక్ష్మి, సెక్రటరీ జయ రాణి, ట్రెజరర్ మగ్బులా, సభ్యులు హైమావతి, సుశీల, పద్మ, అనసూయమ్మ, మాలతి, నిర్మల, శారా తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమికి కళాత్మక స్వాగతం



నెల్లూరు(బృందావనం): రథసప్తమిని పురస్కరించుకొని రథాలను భక్తవత్సలనగర్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి పూజిత కళాత్మకంగా సోమవారం తీర్చిదిద్దారు. కొండల నడుమ ఉదయిస్తున్న ఆదిత్యుడ్ని పెన్సిళ్లు, ఫెవికాల్‌తో చిత్రీకరించారు. 140 చాక్లెట్లతో 18 అంగుళాల ఎత్తు, 20 అంగుళాల వెడల్పుతో మరో రథాన్ని రూపొందించారు.

కార్యక్రమ జయప్రదానికి పిలుపు



ఎమ్మార్పీఎస్ నేతల డప్పుల ప్రదర్శన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం హైదరాబాద్‌లో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల ఏడున నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమాన్ని మాదిగలు జయప్రదం చేయాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య పిలుపునిచ్చారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో డప్పుల ప్రదర్శనను సోమవారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. వర్గీకరణను రాష్ట్రంలో వేగవంతం చేయాలని.. కమిషన్ల పేరుతో కాలయాపన చేయకుండా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ ఫోరం జాతీయ అధ్యక్షుడు రవి రాఘవేంద్ర, మన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రావు, మాతంగి కృష్ణ, డాడీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆనందరావు పాల్గొన్నారు.

శ్రీవారి ఉచిత దీవెనయాత్ర ప్రారంభం



నెల్లూరు(బృందావనం): రథసప్తమిని పురస్కరించుకొని తిరుమల శ్రీవారి ఉచిత దీవెన యాత్రను సత్యమార్గ్ ఫౌండేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పురమందిర ప్రాంగణంలోని జ్యోతి వినాయకస్వామి ఆలయం నుంచి యాత్రను ప్రారంభించిన అనంతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు పూడి రవి మాట్లాడారు. హైందవ ధర్మ ప్రచారం, తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు గానూ దీవెన యాత్రను తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా చేపడుతున్నామని వివరించారు. తోటపల్లి గూడూరు, వరిగొండ, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు రూరల్, సిటీ తదితర ప్రాంతాలకు చెందిన 100 మంది భక్తులతో యాత్రను ఈ దఫా చేపట్టామన్నారు. సభ్యులు కవి స్వామి, మల్లికార్జున, మస్తానమ్మ, నాగరాజు, మాధవయ్య, రఘురామయ్య, డోలుపర్తి పరమటయ్య పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): మద్యానికి బానిసై భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న భర్తపై కేసును వేదాయపాళెం పోలీసులు సోమవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. టైలర్స్ కాలనీకి చెందిన రాజ్యలక్ష్మి, వెంకటశివనారాయణ దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కరెంట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే ఆయన కొంతకాలంగా మద్యానికి బానసయ్యారు. భార్యను శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు సూచించినా, ఆయనలో ఎలాంటి మార్పురాలేదు. దీంతో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఎస్సై ముత్యాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిగీతావిష్కరణ

నెల్లూరు(బృందావనం): వసంత పంచమిని పురస్కరించుకొని గాంధీబొమ్మ సమీపంలోని సాయిబాబా మందిరంలో బాబాపై రూపొందించిన భక్తి గీతాన్ని సోమవారం విడుదల చేశారు. గీత రచయిత రామ్‌ప్రసాద్, రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, అరవ రామ్మోహన్‌రావు, అళహరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నరకం

- వెరిఫికేషన్‌లో తిండి, నీటికి ఇక్కట్లు
- పైసా విదిల్చని ప్రభుత్వం
- భారమంతా డీఆర్డీఏ, వైద్యులపైనే
- పెద్దాస్పత్రిలో గందరగోళం



• ఈ చిత్రంలోని మహిళ మావిడమ్మ వయస్సు 83 ఏళ్లు. తిక్కవరం వాసి. పింఛన్ రూ.200గా ఉన్నప్పటి నుంచి పొందుతున్నారు. ఆపై రూ.వెయ్యి, రూ.రెండు వేలు, రూ.మూడు వేలు, తాజాగా రూ.ఆరు వేల సామాజిక పింఛన్‌ను అందుకుంటున్నారు. వాకర్‌పై రెండడుగులేయలేని పరిస్థితి. దివ్యాంగుల పింఛన్‌ను రూ.ఆరు వేలకు పెంచినట్లే పెంచి అర్హులకు సైతం కోత పెట్టేలా కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో రీ వెరిఫికేషన్‌కు రావాలని పేర్కొంది. దీంతో జిల్లాలో సోమవారం ప్రారంభమైన రీ వెరిఫికేషన్ కోసం సహాయకుడ్ని తీసుకొని ఖర్చు పెట్టుకొని పెద్దాస్పత్రికి ఆటోలో చేరుకున్నారు. సరైన హెల్ప్ డెస్క్ లేకపోవడంతో ఆమె బాధ వర్ణనాతీతమైంది. అతి కష్టంపై మెట్లెక్కుతూ, దిగుతూ ఆర్థోపెడిక్ విభాగంలోని రీవెరిఫికేషన్ సెంటర్‌కు హాజరయ్యారు. మధ్యాహ్నమైనా ఆమె పేరు రాలేదు. తాగునీరు, భోజనానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదే పరిస్థితి అందరికీ తలెత్తింది. బధిరులు, చెప్పే అర్థం చేసుకోలేని మానసిక దివ్యాంగులు, అంధులు, దివ్యాంగులకు నరకమంటే ఏమిటో అధికారులు చూపారు.



నిరీక్షిస్తున్న దివ్యాంగులు, సహాయకులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ప్రస్తుతం పొందుతున్న పింఛన్ల సంఖ్యను భారీగా తగ్గించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అనర్హుల పింఛన్ల తొలగింపునకు అంటూ బుకాయిస్తూ అర్హుల పింఛన్లకు కోత వేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జూన్ వరకు దివ్యాంగులు పొందిన సర్టిఫికెట్లను డాక్టర్లు పరిశీలించి వాటిని అందజేయాలని ఆదేశాలు అందాయి. సొంత జిల్లా వారైతే కనికరం చూపుతారని భావించిన ప్రభుత్వం తిరుపతి డాక్టర్లను ఇక్కడికి పంపారు. ఇక్కడి డాక్టర్లను తిరుపతి, చిత్తూరు పంపారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో మంచానికే పరిమితమైన వారు, దివ్యాంగులు, అంధులు, బధిరులు, దివ్యాంగులు ఇలా 32,638 మంది పింఛన్లు అందుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.ఆరు వేల చొప్పున జిల్లాలో రూ.19.86 కోట్లను చెల్లిస్తోంది. వీరి కోసం ప్రభుత్వ సర్వజన, ఆత్మకూరు, ఉదయగిరి, పొదలకూరు, కోవూరు సామాజిక ఆస్పత్రులు, కావలి, కందుకూరు ఏరియా ఆస్పత్రుల్లో రీ వెరిఫికేషన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. నగరంలోని జీజీహెచ్‌లో ఈఎన్టీ, ఆర్థోపెడిక్, మానసిక, లోకోమోట్ ఇలా నాలుగు విభాగాల్లో కౌంటర్లను తొలి రోజు ఏర్పాటు చేశారు.

లాగిన్, పాస్‌వర్డ్ లేక..

డాక్టర్ల లాగిన్‌కు పాస్‌వర్డ్‌ను ఏర్పాటు చేయాలి. పరీక్షించిన దివ్యాంగుల వివరాలను ఓ ఫార్మాట్‌లో నమోదు చేసి ఆ లాగిన్ ద్వారా ఆన్‌లైన్లో నమోదు చేయాలి. అయితే మధ్యాహ్నానికీ వీటిని ఏర్పాటు చేసుకోలేకపోయారు. కంప్యూటర్లనూ సిద్ధం చేయలేదు. పింఛన్ల శాఖకు సంబంధించిన డీఆర్డీఏ వారే కంప్యూటర్లను ఇవ్వాలని పెద్దాస్పత్రి అధికారులు పేర్కొంటున్నారు. తమ వద్ద లేవని డీఆర్డీఏ అధికారులు చెప్పడంతో రోగులకు ఇబ్బందులు తప్పలేదు. ఏర్పాట్లపై పెద్దాస్పత్రి అధికారులు.. డీఆర్డీఏ బాధ్యులు వాగ్వాదానికి దిగారు.

ప్రభుత్వం శీతకన్ను

ఈ క్యాంపులకు ప్రభుత్వం పైసాను విడుదల చేయకపోవడంతో డీఆర్డీఏ అధికారులు అప్పటికప్పుడు కుర్చీలను కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. షామియానాలు, నేమ్‌బోర్డులను డాక్టర్లు తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకున్నారు.

ఉదయం ఐదింటికి వచ్చా..



ఉదయం ఐదు గంటల బస్సుకు పెద్దాస్పత్రి వెరిఫికేషన్ సెంటర్‌కు వచ్చా. మధ్యాహ్నమైనా జరగలేదు. ఇక్కడికి రావడం కొత్త. బయటకెళ్లి ఏమైనా తిందామంటే డాక్టర్లు తన పేరును ఎప్పుడు పిలుస్తారోనని అలాగే ఉండిపోయా. నాతో పాటు వచ్చిన మరో ముగ్గురు సూపరింటెండెంట్ వద్దకెళ్తే. రెండు గంటల సమయంలో ఆహారాన్ని కొంత మేర ఏర్పాటు చేశారు.

– సుదర్శనమ్మ, కలువాయి

తాగునీటి ప్యాకెట్లను అరకొరా ఏర్పాటు చేశారు.

ఆకలితో నకనక

దివ్యాంగులు, వారికి సహాయకులు సుమారు 800 మంది పెద్దాస్పత్రికి వచ్చారు. ఆహారం లేక.. దివ్యాంగులు కావడంతో బయటకెళ్లలేక భోజనం అందక ఆకలితో అలమటించారు. దీంతో పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్, ప్రొఫెసర్లు నరేంద్ర, మస్తాన్‌బాషా తదితరులు కల్పించుకున్నారు. రోగుల అటెండర్లకు సుభోజనం పేరిట అన్నదానం చేసే వారి వద్ద కొంత మందికి భోజనాన్ని ఏర్పాటు చేశారు. అయినా అనేక మందికి అందలేదు.



పరీక్షిస్తున్న వైద్యుడు

కలెక్టరేట్లో ఊడిన సీలింగ్



నెల్లూరు రూరల్: కలెక్టరేట్లోని ఎల్‌ఏ సెక్షన్లో సీలింగ్ ఊడి కింద పడిపోయింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వాటర్ లీకై సీలింగ్ ఊడి ఉండొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు సైకిళ్ల అందజేత



నెల్లూరు(బృందావనం): కొత్తూరు, అల్లీపురం జెడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న ఇద్దరికి సైకిళ్లను రామ్‌నగర్‌లోని షిర్డీ సాయిబాబా ట్రస్ట్‌లో రోటరీ క్లబ్ సౌత్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, మల్లికాబేగం, గోవిందరాజు సుభద్రాదేవి, షంషుద్దీన్, విక్రమ్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్పగిరీశుడికి సప్తవాహన సేవలు నేడు

నెల్లూరు(బృందావనం): రథసప్తమిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారికి సప్తవాహన సేవలను మంగళవారం నిర్వహించనున్నామని ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో గాథ

- పరిష్కరించాలని ఎస్పీకి అభ్యర్థన



సమస్యలు వింటున్న కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగాల పేరిట మోసం.. పెళ్లి చేసుకొని కాపురానికి తీసుకెళ్లడంలేదు.. ఆస్తి లాగేసుకొని ఇంటి నుంచి గెంటేశారు.. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటి గాథ. సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని అభ్యర్థించారు. చట్టపరిధిలో సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ కృష్ణకాంత్ హామీ ఇచ్చారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 95 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వీటిని పరిశీలించిన ఆయన ఆయా ప్రాంత పోలీస్ అధికారులతో మాట్లాడి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీటీసీ, మహిళా స్టేషన్ డీఎస్పీలు గిరిధర్‌రావు, చెంచురామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

➡ కావలికి చెందిన భరత్‌కుమార్ సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగాలిప్పిస్తానని తనతో పాటు సహచరుల వద్ద రూ.9.6 లక్షలను తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా, ఉద్యోగాలిప్పించకపోవడంతో ఇటీవల నిలదీయగా, చంపుతామని బెదిరిస్తున్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని జలదంకికి చెందిన ఓ యువకుడు కోరారు.

➡ అనంతసాగరానికి చెందిన అమానుల్లా, తాను ప్రేమించుకున్నాం. పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాం. కొద్ది రోజుల అనంతరం అమానుల్లా చెప్పాపెట్టకుండా చెన్నై వెళ్లిపోయారు. కాపురానికి తీసుకెళ్లాలని కోరినా పట్టించుకోవడంలేదు. తనకే సంబంధం లేదనే రీతిలో వ్యవహరిస్తున్నారు. కౌన్సెలింగ్ చేసి కాపురాన్ని చక్కదిద్దాలని వివాహిత విజ్ఞప్తి చేశారు.

➡ తనకు ప్రభుత్వమిచ్చిన భూమిని సాగుచేసుకోనీయకుండా సంగానికి చెందిన సూర్యనారాయణ అడ్డుపడుతున్నారు. కులంపేరుతో దూషిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. అతని వేధింపులతో నా భర్య మరణించారు. విచారణ జరిపి న్యాయం చేయాలని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అభ్యర్థించారు.

➡ కుటుంబకలహాల నేపథ్యంలో భర్త, అత్తింటి వారు నా 18 నెలల బిడ్డను బలవంతంగా తీసుకెళ్లారు. స్థానిక పోలీసులను సంప్రదించినా ప్రయోజనం లేదు. విచారణ జరిపి బిడ్డను తన చెంతకు చేర్చాలని దగదర్తి మండలానికి చెందిన ఓ మహిళ వేడుకున్నారు.

➡ నా పేరుపై ఉన్న ఇంటిని తన పేరుపై చిన్నకుమారుడు రాయించుకున్నారు. ఇంటి నుంచి గెంటేశారు. నిలువ నీడలేక ఇబ్బంది పడుతున్నా. న్యాయం చేయాలని దర్గామిట్టకు చెందిన ఓ వృద్ధురాలు కోరారు.

➡ కొంతకాలం క్రితం నా ఇంట్లో చోరీ జరిగింది. ఉన్నదంతా దోచేశారు. పొదలకూరు పోలీసులు కేసు నమోదు చేసినా, నేటికీ ఎలాంటి పురోగతి లేదు. చోరీ సొత్తును రికవరీ చేసి అందించాలని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి విజ్ఞప్తి చేశారు.

ఆర్థికోన్నతిని చేకూర్చాలి




మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలో నివసిస్తున్న యువతకు ఆర్థికపరమైన ఉన్నతిని చేకూర్చే చర్యలపై విశ్లేషించి, ఉన్నత స్థాయి అవకాశాలను అమలు చేయాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. సిటీ లైవ్లీహుడ్ యాక్షన్ ప్లాన్‌పై కార్పొరేషన్ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష సమావేశాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, మెప్మా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ షాబుద్దీన్, మెప్మా పీడీ రాధమ్మ, ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, డిప్యూటీ సిటీ ప్లానర్ పద్మజ, బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ శామ్యూల్, కార్మిక శాఖ అధికారి అనిల్‌కుమార్, ఎన్జీఓ మదన్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

➡ స్వయం ఉపాధి పథకం ద్వారా బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, కాపులు వాణిజ్య సముదాయాల ఏర్పాటుకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూర్యతేజ కోరారు. ఓబీఎమ్మెస్ పోర్టల్లో దరఖాస్తులను ఈ నెల ఏడులోపు అప్‌లోడ్ చేయాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనను ఎనిమిది నుంచి 11 వరకు.. మండల స్థాయి అధికారులు, బ్యాంక్ అధికారులు క్షేత్రస్థాయిలో 12 నుంచి 14 వరకు పర్యటించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేయనున్నారని చెప్పారు.

తమ ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నమోదు చేసుకోవాలని కోరారు.

9న మిస్ నెల్లూరు ఆడిషన్స్



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని సితార రెస్టారెంట్‌లో మిస్ నెల్లూరు ఆడిషన్స్‌ను ఈ నెల తొమ్మిదిన, గ్రాండ్ ఫినాలేను మార్చి రెండున బ్లాసం బ్లూ ఈవెంట్స్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని లెక్చరర్స్ కాలనీలో బ్రోచర్లను సోమవారం ఆవిష్కరించారు. వివరాలకు 91107 99510 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కళాసంఘాల కన్వీనర్ దోర్నాల హరిబాబు, శ్రీదేవి, సుప్రియ, మహాలక్ష్మి, శర్వాణి, పవన్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి

నెల్లూరు (పొగతోట): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.19750 కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు సివిల్ సప్లయ్స్ డీఎం కార్యాలయంలో అసిస్టెంట్ డీఎం సురేంద్రకు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. నేతలు లక్ష్మీనారాయణ, సురేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై అలిగి కుమారుడి పరార్

నెల్లూరు(క్రైమ్): తల్లిపై అలిగి కుమారుడు పరారైన ఘటనపై కేసును నవాబుపేట పోలీసులు సోమవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మైపాడు రోడ్డులోని శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న దివ్య కుమారుడు అశ్విన్ డిగ్రీ చదువుతూ మధ్యలో మానేశారు. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నారు. చదువుకోమని తల్లి రోజూ చెప్పుండటంతో అలిగి ఇంటి నుంచి గత నెల 27న ఎటో వెళ్లిపోయారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురికి కారుణ్య నియామకాలు



నెల్లూరు(అర్బన్): ప్రభుత్వోద్యోగాల్లో ఉంటూ మృతి చెందిన కుటుంబసభ్యుల్లో ఆరుగురికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తూ ఉత్తర్వులను కలెక్టర్ ఆనంద్ సోమవారం జారీ చేశారు. ఈ క్రమంలో నియామక పత్రాలను డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్ అందజేశారు. గణేష్‌కుమార్, రవితేజ, విష్ణువర్ధన్, నవీన్ కుమార్, పరంధామయ్యను రెవెన్యూ శాఖలో గ్రేడ్ – 2 వీఆర్వోలుగా.. ఖాజాపీర్‌ను పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ – 6(డిజిటల్ అసిస్టెంట్)గా జిల్లా పంచాయతీ కార్యాలయంలో నియమించారు.

అష్టలక్ష్మి మందిరంలో పూజలు



నెల్లూరు(బృందావనం): వసంత పంచమిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని దత్తనాథ క్షేత్ర ప్రాంగణంలో గల కృష్ణయోగ, అష్టలక్ష్మి మందిరంలో విశేష పూజలను అవధూత దత్తపీఠం, నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గోపూజ, శ్రీచక్రార్చన, సరస్వతీ హోమం, ఉమా సహిత నాగేశ్వరస్వామికి రుద్రాభిషేకార్చనలను మైసూరు అవధూత దత్తపీఠాధీశ్వరుడు గణపతి సచ్చిదానంద జరిపారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు తదితర విద్యాసామగ్రిని అందజేశారు. దివ్యనామ సంకీర్తనను వీనులవిందుగా నిర్వహించారు. తౌలుత అవధూత దత్త పీఠ ఉత్తరాధిపతి దత్త విజయానందతీర్థతో కలిసి పూజలు, హోమాలను జరిపారు. పిల్లలకు మంగళశాసనాలను గణపతి సచ్చిదానంద అందజేశారు. గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞాన బోధ సభ ట్రస్ట్, నెల్లూరు మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పచ్చిపాల ప్రమీలమ్మ, అనపల్లి మస్తాన్‌రెడ్డి, అనపల్లి అశోక్‌రెడ్డి, ఫణిరత్నం, డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న, రేబాల పట్టాభిరామిరెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ఆలయాల్లో వసంత పంచమిని భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. సరస్వతీ అమ్మవారికి పూజలు జరిపి, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పలకలు, బలపాలు, పెన్నులు, పుస్తకాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు.

➡ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అక్షరాభ్యాసాన్ని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు చేయించారు.

➡ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో గణపతి పూజ, సామూహిక లలిత సహస్రనామ పారాయణం, సరస్వతీ అమ్మవారి సహస్రనామార్చన, విశేష పూజలను నిర్వహించారు. విద్యాసామగ్రిని 200 మందికి అందజేశారు. ఈఓ విరుపావరుల గిరికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సంపత్‌యాదవ్, ఆలయ ప్రధానార్చకుడు చంద్రశేఖర్‌స్వామి, జయస్వామి తదితరులు పాల్గొన్నారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అక్షరాభ్యాసాన్ని బీజేపీ నేత ముక్కు రాధాకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం విద్యాసామగ్రిని అందజేశారు. నేతలు తిరకాల వేణుగోపాల్‌గౌడ్, బాలకృష్ణ, రఘురామ్‌గౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మూలస్థానేశ్వరాలయంలో..



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అక్షరాభ్యాసం



రాజరాజేశ్వరి ఆలయంలో..

డిప్యూటీ మేయర్‌కు అభినందన

నెల్లూరు(సెంట్రల్): డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన తహసీన్‌ను మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ సోమవారం అభినందించారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అభినందనలను తెలియజేశారు.

➡ అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నేత మంగమ్మకు ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో మంత్రి నారాయణ అందజేశారు.

ప్రాక్టికల్స్‌పై 6, 7న అవగాహన

నెల్లూరు (టౌన్): ఇంటర్ ద్వితీయ సంవత్సర సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఈ నెల పది నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లకు అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నామని ఆర్ఐఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న ఫిజిక్స్, బాటనీ.. 7న కెమిస్ట్రీ, జువాలజీ అధ్యాపకులు.. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు చీఫ్ సూపరింటెండెంట్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.